సాక్షి
వైఎస్సార్ జిల్లా
మంగళవారం । 25 । జూలై । 2023



కడప జట్టు విజయభేరి

కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్-19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు విజయం సాధించింది. - 8లో



మణిపూర్ మారణకాండపై వెల్లువెత్తిన నిరసన

మణిపూర్‌లో జరుగుతున్న పరిణామాలపై సోమవారం కడపలో క్రైస్తవ, ముస్లిం, అఖిలపక్ష పార్టీలు నిరసన వ్యక్తం చేశాయి. - 8లో

గరిష్టం/కనిష్టం
33.6 /25.2

వాతావరణం

జిల్లాలో సోమవారం 25.2 - 33.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

ఉత్సాహం ఉప్పొంగంగ



"ఈయన పేరు సంగిశెట్టి మల్లేష్. ముద్దనూరు మండలం ఉప్పలూరు గ్రామంలో 5 ఎకరాల పొలం ఉంది. సుమారు 20 ఏళ్లుగా సాగుచేస్తున్నారు. మెట్టప్రాంతం కాబట్టి వ్యవసాయ బోర్లను ఆశ్రయించి పంటలు సాగుచేసేవారు. దాదాపు 700 అడుగుల లోతు వరకు 3 బోర్లు వేశాడు. అరకొర నీరు కొద్ది కాలం రావడం, బోరు ఎండిపోవడం సాధారణమైంది. 2012లో బోరు ఎండిపోవడంతో వంకాయ పంటకు ట్రాక్టర్ ట్యాంకర్లతో నీరు సరఫరా చేసి అవస్థలు పడ్డారు. గండికోట జలాశయంలో నీరు నిల్వ ఉండడం, గాలేరి–నగరి ప్రధాన కాలువ ద్వారా నీరు వెళ్తుండడంతో భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయని ఉప్పలూరు రైతులు వివరిస్తున్నారు.



ఈ రైతు పేరు పల్లేటి భాస్కర్‌రెడ్డి. తొండూరు మండలం క్రిష్ణంగారిపల్లె గ్రామం. మెట్ట ప్రాంతంలో వ్యవసాయం సాగు కోసం అవస్థలు పడ్డారు. 12 ఎకరాల్లో పంటలు సాగుచేసేందుకు ఒకదాని తర్వాత మరొకటి 48 బోర్లు వేశారు. బోర్లు ఎండిపోయే కొద్ది మరో బోరు వేస్తూ వ్యవసాయం సాగులోకి తెచ్చుకునేందుకు తలమునకలయ్యారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక చిత్రావతి, పైడిపాలెం రిజర్వాయర్లకు పుష్కలంగా నీరు చేరుతోంది. సాగునీటి సమస్య తలెత్తలేదు. నిశ్చింతగా వ్యవసాయం సాగిస్తున్నారు.

- జిల్లాలో పెరిగిన భూగర్భజలాలు
- మెట్ట ప్రాంతంలో పంట పొలాలు కళకళ
- జిల్లాలోని ప్రాజెక్టుల్లో 46టీఎంసీల నీరు నిల్వ
- చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో కరువు మండలాలు నమోదు
- నాలుగేళ్లుగా ఒక్క కరువు మండలం కూడా నమోదు కాని వైనం




మిరప పంట (ఇన్‌సెట్) బోరు ద్వారా నీటి ప్రవాహం

సాక్షి ప్రతినిధి, కడప : జిల్లాలోని రైతుల మోములో చిరునవ్వు తొణికిసలాడుతోంది. సకాలంలో పంటలు సాగు కావడం..పెట్టుబడులకు ప్రభుత్వం ప్రోత్సాహం అదించడం.. ఆశించిన దిగుబడులు రావడం.. దిగుబడులకు తగ్గట్లు ధరలు ఉండటమే దీనికి కారణం. 'రాజులో సుగుణాలు ఉంటే రాజ్యం సుభిక్షం'గా ఉంటుందనేది శ్రీరామచంద్రుడి కాలం నుంచి వస్తున్న నానుడి. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా ఆంధ్రప్రదేశ్ కన్పిస్తోంది. ముఖ్యమంత్రిగా నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనూ, ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాలంలో పంటపొలాలు అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. గడిచిన ఐదేళ్లతో పోలిస్తే భూగర్భజలాలు గణనీయంగా పెరిగాయి. బీడు భూములుగా దర్శనమిచ్చే మెట్ట ప్రాంతాలు భూమికి పచ్చాని రంగేసినట్లు దర్శనమిస్తున్నాయి. పల్లెల్లో తాగునీటి ఎద్దడి అనే సమస్యే ఉత్పన్నం కాలేదు. కరువు మండలం అనే ఊసే లేదు. ఇవన్నీ కూడా రైతు మోములో చిరునవ్వుకు సంకేతాలుగా నిలుస్తున్నట్లు విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

పెరిగిన భూగర్భజలాలు

ఐదేళ్ల క్రితం జిల్లాలో 16.42 మీటర్ల లోతులో ఉన్న భూగర్భజలాలు ప్రస్తుతం 5.70 మీటర్ల పరిధిలో ఉన్నాయి. దాదాపు 11 మీటర్ల పైకి భూగర్భజలాలు వృద్ధి చెందాయి. మెట్ట ప్రాంత రైతులకు భూగర్భ జలాలు ప్రధాన వనరు కావడంతో పంటలు సాగుకు ఎంతో యోగ్యకరంగా నిలిచాయని నిపుణులు వెల్లడిస్తున్నారు. మరోవైపు చంద్రబాబు సర్కార్‌లో ఐదేళ్లు కరువు తాండవించడంతో పెట్టిన పంటల దిగుబడి లేకుండా పోయింది. రైతులు వ్యయప్రయాసలకు లోనయ్యారు. జిల్లా మొత్తం 51 మండలాలను కరువు మండలాలుగా రెండుసార్లు ప్రకటించారు. మరో ఏడాది 48 మండలాలు కరువు మండలాలు గుర్తించారు. ఐదేళ్లల్లో మూడేళ్లు జిల్లాలో సంపూర్ణ కరువు తాండవించిందని రికార్డులు స్పష్టం చేస్తున్నాయి. చంద్రబాబునాయుడు, కరువు కవల పిల్లలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి అనేక సార్లు బాహాటంగా ఆరోపించారు. వాస్తవిక రికార్డులు అందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యాఖ్యలు అక్షర సత్యమని రుజువు చేస్తున్నాయి. వైఎస్సార్ జిల్లాను పరిశీలిస్తే టీడీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లు కరువు తాండవించింది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో జిల్లాలో 9.14శాతం పేదరికం ఉంటే, ప్రస్తుతం 3.34శాతం మాత్రమే పేదరికం ఉన్నట్లు ఇటీవల నీతి ఆయోగ్ నివేదిక సైతం వెల్లడించడం విశేషం.

ఊపిరి పోసుకుంటున్న ఉద్యాన పంటలు..

సకాలంలో వర్షాలు కురుస్తుండడం, భూగర్భజలాలు పుష్కలంగా ఉండడంతో ఉద్యాన పంటల పట్ల రైతాంగం ప్రత్యేక దృష్టి సారించింది. జిల్లా వ్యాప్తంగా 52,018 హెక్టార్లల్లో సాగులో ఉన్నాయి. ప్రధానంగా అరటి, చీనీ, బొప్పాయి ఇతర రాష్ట్రాలతోపాటు, విదేశీ ఎగుమతులు జిల్లా నుంచి భారీగా ఉండిపోయాయి. అరటి ఈ ఏడాది టన్ను ధర రూ.30 వేలు కూడా పలికింది. చీని పండ్లు ఇప్పటికీ టన్ను రూ.50వేలు ధర పలికింది. ఉద్యాన పంటలు జిల్లాలో కాసుల వర్షం కురిపించాయి. ధాన్యం, పప్పుధాన్యాలు, నూనెగింజలు పంటల దిగుమతులకు కూడా ధరలు ఆశాజానంగా ఉండడంతో వ్యవసాయం పండుగగా మారింది.

ప్రభుత్వ చేయూతతో...

ఓవైపు ప్రకృతి సహకరించడం, మరోవైపు ప్రభుత్వం చేయూత ఇవ్వడంతో సాగుకు మరింత యోగ్యకరంగా నిలించింది. పాడుబడిన బోర్లల్లో సైతం సాగునీరు లభిస్తోంది. మరోవైపు రైతు భరోసా ద్వారా రూ.1,219 కోట్లు జిల్లాలోని రైతాంగానికి దక్కింది. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటల నష్టం ఉంటే తక్షణ సాయం దక్కుతోంది. జిల్లాలోని రైతులకు ఈవిధంగా రూ.282 కోట్లు చెల్లించారు. పంటలబీమా ద్వారా రూ.737.27 కోట్లు దక్కింది. ఇవన్నీ కూడా పంటలసాగుకు ఎంతో ఉపయోకరంగా నిలిచాయని రైతాంగ నిపుణులు వెల్లడిస్తున్నారు.

ఇప్పటికే 46.5 టీఎంసీల నీరు నిల్వ....

జిల్లాలోని గండికోట జలాశయం నుంచి మొదలు పెడితే, మైలవరం, చిత్రావతి, పైడిపాలెం, సర్వారాయ సాగర్, వామికొండ, బ్రహ్మంసాగర్, ఎస్ఆర్–1, 2 తదితర రిజర్వాయర్లల్లో ఇప్పటికే 46.5టీఎంసీ నీరు నిల్వ ఉంది. వైఎస్సార్ జిల్లాలో తాగునీటి ఎద్దడికి అనేక అవస్థలు పడుతున్న రోజుల నుంచి సంమృద్ధిగా నీరు ఉండడం విశేషంగా నిలుస్తోంది. టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.100 కోట్లకు పైగా తాగునీటి ఎద్దడి కోసం వెచ్చించాల్సిన దుస్థితి ఏర్పడింది. ట్యాంకర్లతో తాగునీరు సరఫరా నిమిత్తం దాదాపు రూ.86 కోట్లు చంద్రబాబు సర్కార్ చెల్లిస్తే, మరో రూ.14కోట్ల పెండింగ్ బకాయిలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మొదటి ఏడాది చెల్లించింది. ఇవే కాకుండా మరో రూ.2.5 కోట్లు ప్రైవేట్ వ్యక్తుల బోర్లకు బాడుగ వెచ్చించి నీరు సరఫరా చేశారు. ఇలాంటి దుస్థితి గడిచిన నాలుగేళ్లల్లో జిల్లాలో లేకపోవడం విశేషం.

ఉత్సాహంగా పంటలు సాగు చేస్తున్నాం



సర్వారాయసాగర్ ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉండడం వల్ల ఉత్సాహంగా పంటలు సాగు చేస్తున్నాం. భూగర్భజలాలు బాగా పెరిగాయి. వ్యవసాయ బోర్లు ఎండిపోయే సమస్యే తలెత్తలేదు. గతంలో పంటలు సాగు చేయాలంటే భయపడేవాళ్లం. ఎండాకాలం వస్తే బోర్లు ఎండిపోయి పంటను కాపాడుకొనేందుకు ఎంతో శ్రమించేవాళ్లం. ట్రాక్టర్ల ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేసి చీనీ చెట్లను కాపాడుకునే వాళ్లం. సర్వారాయసాగర్ ప్రాజెక్టు మెట్ట ప్రాంతమైన మాకు వరంగా నిలుస్తోంది. బోర్లు ఎక్కడ వేసినా నీరు పడుతున్నాయి. ఎలాంటి భయాందోళనలు లేకుండా పంటలు పండించుకుంటున్నాం.
- వీరప్రతాప్‌యాదవ్, రైతు, మిట్టపల్లె, వీఎన్‌పల్లె

రైతు ఇంట సిరులు



రైతులకు అవసరమైన వసతులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమకూర్చారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటల నిర్వహణకు అవసరమైన సలహాలు సూచనలు, ఎరువులు, విత్తనాలు అందిస్తున్నాం. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం ఏర్పడితే తక్షణమే పరిహారం దక్కుతోంది. సాగుకు కావాల్సిన ఆర్థిక సహాయానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. ఇవన్నీ కూడా గణనీయంగా సాగు విస్తీర్ణం పెరగడానికి కారణమైంది. దిగుబడికి తగ్గట్లు ధరలు ఉండడంతో రైతు ఇంట సిరులు కురుస్తున్నాయి.
- ఐ నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారి

నారా చంద్రబాబునాయుడు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఖరీఫ్, రబీ సీజనల్లల్లో జిల్లాలో సాగులోకి వచ్చిన భూవిస్తీర్ణం హెక్టార్లల్లో..

ఏడాది	ఖరీఫ్ సాధారణసాగు	సాగుబడి	రబీ సాధారణ సాగు	సాగుబడి
2014–15	1,73,253	1,08,678	2,00,637	1,44,182
2015–16	1,57,687	1,14,106	1,94,085	1,93,913
2016–17	1,23,320	1,49,458	1,88,668	1,35,725
2017–18	1,25,585	1,04,171	1,74,970	1,68,162
2018–19	1,33,556	75,301	1,72,929	1,65,641
2019–20	1,16,887	73,792	1,68,440	1,58,671
2020–21	99,286	96,426	1,67,347	1,85,088
2021–22	98,495	1,01,590	1,57,719	1,55,182
2022–23	70,143	94,565	1,50,812	1,22,493

2014-19 టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో కరువు మండలాలు

ఏడాది	కరువు మండలాలు
2014–15	48
2015–16	51
2016–17	32
2017–18	15
2018–19	51

తాగునీటి సరఫరాకు ఖర్చు చేసిన వివరాలు

ఏడాది	గ్రామాలు	వెచ్చించినది (కోట్లల్లో)
2014–15	189	2.66
2015–16	692	12.45
2016–17	123	1.19
2017–18	301	15.71
2018–19	110	3.80
2019–20	892	50.64

భూగర్భ జలాల వివరాలు...

ఏడాది	భూగర్భజలాలు (మీటర్లు)	వర్షపాతం (మిల్లీమీటర్లు)
2017	16.42	41.55
2018	14.66	19.27
2019	21.49	31.07
2020	14.22	62.94
2021	5.55	62.04
2022	5.70	64.05

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: పులివెందులలోని రమణప్ప సత్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద పనిచేసేందుకు ఆసక్తిగల జిల్లాలోని జెడ్పీ, మండల పరిషత్‌లు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లు 28వ తేదీలోపు విద్యార్హత పత్రాలను సమర్పించాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. హిందీ, ఇంగ్లీష్ మూడు పోస్టులు చొప్పున.. గణితం, ఫిజికల్, బయలాజికల్ సైన్సు పోస్టులు ఒక్కొక్కటి ఉన్నాయన్నారు. వివరాలకు 9951438684, 9381838336 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఓపెన్ స్కూళ్లలో ..

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఏపీఓఎస్ఎస్) (ఓపెన్‌స్కూల్) ద్వారా 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశం కోసం నోటిఫికేషన్ విడుదలైందని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ రాఘవరెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటసుబ్బారెడ్డిలు సంయుక్త ప్రకటనలో తెలిపారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేసుకోవడానికి జులై 26 నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు గడువు ఉందని చెప్పారు. రూ. 200 ఆపరాధ రుసుంతో ఆన్‌లైన్‌లో ఆప్లికేషన్ సబ్మిట్ చేసేందుకు అక్టోబర్ 5వ తేదీ వరకు గడువు ఉందన్నారు. మరిన్ని వివరాలకు www.apopenschool.ap.gov.in వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చన్నారు. లేదంటే కడప డీఈఓ కార్యాలయంలోని ఓపెన్ స్కూల్ సొసైటీ జిల్లా కోర్డినేటర్ వెంకటసుబ్బారెడ్డిని సంప్రదించాలని డీఈఓ తెలిపారు.

బీఈడీ పరీక్షలు ప్రారంభం



పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ ఒకటి, నాలుగో సెమిస్టర్ పరీక్షలు, సెకండ్ సెమిస్టర్ (బ్యాక్‌లాగ్) పరీక్షలు సోమవారం జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. కడపలోని ఎస్.వి. డిగ్రీ కళాశాల, పుష్పగిరి బీఈడీ కళాశాల, నిర్మల బీఈడీ కళాశాల, నాగార్జున డిగ్రీ కళాశాల పరీక్ష కేంద్రాలను వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి తనిఖీ చేశారు. కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఇద్దరు విద్యార్థులను డీబార్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీసీ, రిజిస్ట్రార్‌ల మార్గదర్శనంలో పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మత్స్య సహకార సంఘం కార్యవర్గం ఎన్నిక



వెంకటరమణ



జమాలయ్య

బద్వేలు అర్బన్ : మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా బద్వేలుకు చెందిన మిరప్పల్లె వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కడపలోని జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎఫ్‌డీఓ టి.మద్దిలేటి అధ్యక్షతన జిల్లా డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. ఇందులో వెంకటరమణను జిల్లా అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా కాశినాయన మండలం నరసాపురానికి చెందిన జమాలయ్యను ఎన్నుకున్నారు. వీరికి మత్స్యశాఖ ఏడీ కిరణ్‌కుమార్, ఎఫ్‌డీఓ మద్దిలేటిలు నియామకపత్రాలను అందజేశారు. సమావేశంలో జిల్లా డైరెక్టర్లు జి.వెంకటరమణ, పి.వెంకటసుబ్బయ్య, కె.రమణయ్య, చంద్రశేఖర్, మత్స్య సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీ జేఏసీ సమ్మె నోటీసు



ఆర్టీపీపీ సీఈకి సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు(ఆర్టీపీపీ) జేఏసీ నాయకులు సమ్మె నోటీసు ఇచ్చారు. ఇందులో పనిచేస్తున్న ఉద్యోగులు, పెన్షనర్లు, కాంట్రాక్టు కార్మికుల వేతన సవరణతో కూడిన డైరెక్ట్ పేమెంట్ మెడికల్ పాలసీ , ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ మార్పు తదితర డిమాండ్‌లపై ఈ నెల 27వ తేదీ నుంచి సమ్మె చేపట్టనున్నట్లు చెప్పారు. ఈమేరకు నాయకులు నోటీసును సోమవారం ఆర్టీపీపీ సీఈ నాగరాజుకు అందించారు.

అర్జీలను సకాలంలో పరిష్కరించాలి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : అర్జీదారుల సమస్యలు సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిశీలించారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తిని క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేపట్టాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు వాటి పరిష్కారం జరగాలన్నారు. కార్యక్రమంలో జేసీ గణేష్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్‌మీనా, డీఆర్వో గంగాధర్‌గౌడ్, డ్వామా, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ పీడీలు యదుభూషణ్‌రెడ్డి, ఆనంద్‌నాయక్, శ్రీలక్ష్మి, స్పెషల్ కలెక్టర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తి సంఘాలను బలోపేతం చేయాలి

జిల్లాలో పాల ఉత్పత్తిని పెంచడం ద్వారా డైయిరీ సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన అధికారులతో మాట్లాడుతూ పులివెందుల నియోజకవర్గంతోపాటు పెండ్లిమర్రి, వీఎన్ పల్లె మండలాల పరిధిలో ఇప్పటివరకు నిర్వహణలో ఉన్న, విస్తరణ చేపట్టిన గ్రామాల్లో పాల సేకరణ పెంపొందించాలన్నారు. యూనిట్లలో ఒకసారి మిషనరీ ఏర్పాటు చేశాక పాల సేకరణ ఆగరాదన్నారు. ఎంపీడీఓలు, మెంటర్లు, ఆర్ఐసీ, ఏపీడీడీసీఎఫ్ అధికారులు బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఇప్పటికే పాల సేకరణ జరుగుతున్న గ్రామాల్లో రిజిస్టర్ అయిన పాడి రైతులు క్రమం తప్పక పాలుపోసేలా చర్యలు చేపట్టాలన్నారు. బల్క్ మిల్క్ యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియ చేపట్టాలన్నారు.మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్ చంద్, జిల్లా సహకార అధికారి సుభాషిణి, పశు సంవర్ధకశాఖ జేడీ శారద తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై స్పందించాలి:ఎస్పీ

కడప అర్బన్ : జిల్లాలో బాధితులు పోలీసుశాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్పీ బాధితులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 'స్పందన' ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న గృహ నిర్మాణాలపై కలెక్టర్ సోమవారం సభా భవనంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమయం వృథా చేయకుండా లక్ష్యాలను నిర్ణీత గడువులో సాధించాలన్నారు. ప్రతి వారం ప్రగతి నివేదికలు అందజేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రతిభకు పదును..సృజనకు దన్ను

- ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్‌లో ప్రాజెక్టుల రూపకల్పనకు అవకాశం
- ఆగస్టు 31 వరకు నామినేషన్ల స్వీకరణకు గడువు



గతేడాది జిల్లాస్థాయికి ఎంపికైన ప్రాజెక్టు

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్ మనాక్ వేదికగా నిలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక మంతిత్వశాఖ ఏటా ఇన్‌స్పైర్ మనాక్ అవార్డ్స్ పేరిట విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తోంది. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్, రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం 2023–24 విద్యా సంవత్సరానికి ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ పేరిటి పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన నామినేషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.

జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి..

జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లో 6 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు సైన్స్ ఉపాధ్యాయులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సి ఉంటుంది. జిల్లావ్యాప్తంగా వెయ్యికి పైగా స్కూళ్లు ఉన్నాయి. వీటిలో ప్రతి పాఠశాల నుంచి 5 నామినేషన్లు తగ్గకుండా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. జిల్లావ్యాప్తంగా 5 వేల నామినేషన్లు స్వీకరించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఇందులో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టుల వివరాలను www.inr pireawardr.drt.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని పాఠశాల లాగిన్ ద్వారా నమోదు చేయాలి. ఇందుకు ఆగస్టు 31వ తేదీ వరకు గడువు ఉంది. సామాజిక సమస్యలకు పరిష్కారం సూచించే విధంగా విద్యార్థులు చక్కటి ఆలోచనతో డ్రాఫ్ట్ రూపంలో తీర్చిదిద్ది ఇన్‌స్పైర్ అవార్డు మనాక్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలి. విద్యార్థులు పంపించిన అంశాలను వారు పరిశీలించి మంచి ఆలోచనలతో కూడిన ప్రాజెక్టును ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన ప్రాజెక్టుకు రూ. 10 వేలు వారి బ్యాంకు ఖాతాకు జమ చేస్తారు. ఈ డబ్బులతో ఉపాధ్యాయుడి సహకరంతో విద్యార్థి ప్రాజెక్టును సిద్ధం చేసి జిల్లా ప్రదర్శనకు రావాల్సి ఉంటుంది.

ఎంపికైన ప్రాజెక్టు వివరాలు ఇలా...

సంవత్సరం	జిల్లాస్థాయి	రాష్ట్ర	జాతీయ
2015–16	720	72	04
2016–17	784	78	08
2017–18	496	78	07
2018–19	362	36	03
2020–20	483	48	05
2020–21	335	34	03
2021–22	351	35	01
2022–23	272	–	–

దరఖాస్తు ఎలా చేయాలంటే..

- తొలుత పాఠశాల స్థాయిలో ఐడియా కాంపిటీషన్ నిర్వహించాలి. స్థానిక సమస్యలను తీర్చేదిగా ఆ ఆలోచన ఉండాలి.
- తరగతివారీగా ఉత్తమ ఆలోచనను ఎంపిక చేసి అందుకు అవసరమై ప్రాజెక్టు రూపొందించాలి.
- విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతి, విద్యార్థి బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు ఎంటర్ చేయాలి.
- ప్రాజెక్టు పేరు, శాస్త్ర, సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి.
- ప్రాజెక్టు ఎంపిక రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లా స్థాయిలో ప్రకటిస్తారు. తర్వాత వాటిని రాష్ట్ర స్థాయికి పంపిస్తారు.
- ఎంపికైన ప్రాజెక్టును ప్రయోగ నిమిత్తం బ్యాంకు ఖతాలో రూ. 10 వేలు జమచేస్తారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి



ప్రాజెక్టులు తయారు చేసేలా విద్యార్థులను ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సైన్స్ ఉపాధ్యాయులు ప్రొత్సహించాలి. జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి 5 వేల నామినేషన్లను చేయించేలా టార్గెట్ పెట్టుకున్నాము. పాఠశాలస్థాయిలో రూపొందించిన ప్రాజెక్టుల నుంచి ఎన్ఐఎఫ్ వారు కొన్నిటిని జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారు.
- బి. మహేశ్వరరెడ్డి, జిల్లా సైన్సు అధికారి

కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



ప్రతి పాఠశాల నుంచి తప్పని సరిగా ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి నమూనాలను అప్‌లోడ్ చేయాలి. ముఖ్యంగా ప్రతి ప్రైవేటు పాఠశాల యాజమాన్యం తప్పనిసరిగా ఇన్‌స్పైర్ మనాక్ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలి. ఈ విషయంలో ప్రధానోపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి. సైన్స్ ఉపాధ్యాయుల ద్వారా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి

ఆలోచనలకు పదును పెట్టాలి



విద్యార్థులు తమ ప్రతిభ నిరూపించుకుని బాలశాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు చక్కటి అవకాశం. ఆలోచనలకు పదును పెట్టి ఉత్తమ ప్రాజెక్టులు ఆవిష్కృతం చేయాలి. ప్రాజెక్టుల రూపకల్పనపై త్వరలోనే సైన్స్ ఉపాధ్యాయులకు ఓరియెంటేషన్ తరగతులు నిర్వహిస్తాం.
- మార్తాల వెంకటకృష్ణారెడ్డి, ఆర్‌జేడీ, పాఠశాల విద్య

వైవీయూ పీజీ సెమిస్టర్ ఫలితాల విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, సీఈ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం, అనుబంధ పీజీ కళాశాలల విద్యార్థుల 3వ సెమిస్టర్ ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి విడుదల చేశారు. సోమవారం వైవీయూలో వీసీ మాట్లాడుతూ ఈ ఏడాది మార్చిలో 3వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్షా ఫలితాలను సబ్జెక్టుల వారీగా వివరించారు. ఎంసీఏ (97.92శాతం), ఎంఎస్సీ బోటనీ (100శాతం), బయోకెమిస్ట్రీ (100), కెమిస్ట్రీ (84.87, జియాలజీ (100), మ్యాథమ్యాటిక్స్ (73.33), మైక్రోబయాలజీ (100), ఫిజిక్స్ (90.32), బయోటెక్నాలజీ (100), కంప్యూటర్‌సైన్స్ (89.13), జువాలజీ (93.75), పర్యావరణశాస్త్రం (100), జెనిటిక్స్ అండ్ జీనోమిక్స్ (100), నానోటెక్నాలజీ (100), సైకాలజీ (100), ఫుడ్‌టెక్నాలజీ (100), ఫిజికల్ ఎడ్యుకేషన్ (100), ఫైన్‌ఆర్ట్స్ యేడాది వ్యవధి గల సర్టిఫికెట్ కోర్సుల్లో (100 శాతం) ఫలితాలు వచ్చాయన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన కళాశాలల్లో అధ్యాపకులు, విద్యార్థులను వీసీ అభినందించారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ విభాగం సహాయ అధికారి డా. సుమిత్ర పాల్గొన్నారు.

క్లుప్తంగా

సిమ్ కార్డుల అక్రమ విక్రేతలపై కేసులు

కడప అర్బన్ : సరైన డాక్యుమెంట్లు లేకుండా జిల్లాలో అక్రమంగా సిమ్ కార్డులు విక్రయించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు.

■ కేంద్ర ప్రభుత్వం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్స్ (డి.ఓ.టి) ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిఫై రిజిస్టర్) ద్వారా జిల్లాలో 110 మొబైల్ ఫోన్‌లు రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పీ తెలియజేశారు. ఎవరైనా మొబైల్‌ఫోన్‌లు పోగొట్టుకున్నా, చోరీకి గురైనా బాధితులు వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో లేదా సమీప పోలీస్ స్టేషన్‌లలో ఫిర్యాదు చేయాలని సూచించారు.

■ ఇటీవలి కాలంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులను లక్ష్యంగా చేసుకుని మీ డబ్బులను రెట్టింపు చేస్తామని మాయమాటలు చెబుతూ సైబర్ నేరగాళ్లు సెల్‌ఫోన్ కాల్స్ ద్వారా, వాట్సాప్ కాల్స్ ద్వారా మెసేజ్‌లు పంపి మోసగిస్తున్నారని, బాధితుల ఫిర్యాదుపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం లారీతో విజిలెన్స్ అధికారులు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల నుంచి 774 రేషన్ బియ్యం బస్తాలతో బెంగళూరు వెళుతున్న లారీని ఆదివారం రాత్రి కడప విజిలెన్స్ సీఐ రెడ్డెప్ప, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్ పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. లారీని, డ్రైవర్‌ను పోరుమామిళ్ల ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డికి అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, డ్రైవర్‌కు స్టేషన్ బెయిల్ ఇచ్చామని ఎస్‌ఐ చెప్పారు.

‘మణిపూర్’ మారణకాండపై వెల్లువెత్తిన నిరసన



సీఎస్‌ఐ సెంట్రల్ చర్చి నుంచి ర్యాలీలో పాల్గొన్న మహిళలు



ఏడు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష పార్టీల నాయకులు

- క్రైస్తవ, ముస్లిం, అఖిలపక్ష పార్టీల భారీ ర్యాలీ
- కదం తొక్కిన మహిళా లోకం

కడప సెవెన్‌రోడ్స్/కడప కల్చరల్ : మణిపూర్‌లో జరుగుతున్న పరిణామాలపై సోమవారం కడప నగరంలో క్రైస్తవ, ముస్లిం, అఖిలపక్ష పార్టీలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. మణిపూర్ బాధితులకు సంఘీభావంగా నగరంలోని అన్ని చర్చిల సభ్యులు సీఎస్‌ఐ సెంట్రల్ చర్చి నుంచి ర్యాలీ నిర్వహించారు. అలాగే పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రదర్శనగా ఏడురోడ్ల కూడలికి చేరుకున్నారు. వివిధ రాజకీయ పార్టీలు పాల్గొని సంపూర్ణ సంఘీభావం ప్రకటించాయి. అనంతరం ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు.

సత్వర న్యాయం చేయాలి

మణిపూర్ సంఘటనలు అత్యంత విచారకరమని, బాధితులకు రక్షణ కల్పించడంతోపాటు తక్షణ న్యాయం చేయాలని సీఎస్‌ఐ సెంట్రల్ చర్చి కార్యదర్శి పి.మనోహర్‌బాబు, ట్రెజరర్ పి.డేనియల్, సి.మత్తయ్యలు డిమాండ్ చేశారు. రాయలసీమ డయాసిస్ బిషప్ ఐజాక్ వరప్రసాద్ సూచనల మేరకు తాము ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. మణిపూర్‌లోని ఒక వర్గానికి చెందిన మహిళలను అత్యంత అమానవీయ పద్ధతుల్లో నగ్నంగా ఊరేగించడం సభ్య సమాజం సిగ్గుతో తలవంచుకోవాల్సిన చర్య అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగిన బలగాలను దింపి శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. అన్ని వర్గాల ప్రజల్లో విశ్వాసం నెలకొల్పేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కడప నగరంలోని క్రైస్తవుల మనోభావాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

మోదీ, అమిత్‌షాల రాజీనామాకు డిమాండ్

మణిపూర్‌లో మహిళల మానప్రాణాలకు రక్షణ కల్పించలేని మోదీ, అమిత్‌షాలు వెంటనే రాజీనామాలు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాష, సుబాన్‌బాష, కార్పొరేటర్ షఫీ, టీపీ వెంకట సుబ్బమ్మ, సీపీఐ నాయకులు ఈశ్వరయ్య, చంద్ర, సావంత్ సుధాకర్, సీపీఎం నాయకుడు రామ్మోహన్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు అమీర్‌బాబు, కాంగ్రెస్ నాయకులు సత్తార్, వివిధ మహిళా సంఘాల నాయకురాళ్లు బషీరున్నీసా, తస్లీమాలు డిమాండ్ చేశారు. మెజార్టీ తెగ అయిన మెహెతి ప్రజలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అక్కడి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులే హింసాయుత సంఘటనలకు కారణమన్నారు. ప్రభుత్వ వైఖరితో కుకి తెగకు చెందిన గిరిజనులు అభద్రతా భావానికి గురయ్యారన్నారు. రెండు తెగల మధ్య మొదలైన ఘర్షణ వల్ల మణిపూర్ అగ్నిగుండంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో ఇంత జరుగుతున్నా ప్రధాని మోదీ మౌనం వహించడం దురదృష్టకరమన్నారు. రెండు తెగల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుకోవాలని బీజేపీ భావిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా మణిపూర్‌లో శాంతియుత పరిస్థితులు నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వలరాజు, ఏఐవైఎఫ్ నాయకుడు మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

హింసను అణచివేయాలి

కడప కార్పొరేషన్ : మణిపూర్‌లో జరుగుతున్న హింసను ఉక్కుపాదంతో అణచివేయాలని సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వ్యవస్థాపకుడు షా మహమ్మద్, జిల్లా అధ్యక్షుడు పి.ఖాదర్‌బాషా కోరారు. మట్టిపెద్దపులి నుంచి హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, బుజ్జి, రఫీ, సర్దార్, నూర్ పాల్గొన్నారు.



ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న క్రైస్తవ పెద్దలు



ర్యాలీ నిర్వహిస్తున్న అఖిల పక్ష, ప్రజా సంఘాల నాయకులు



ధర్నా నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కొవ్వొత్తుల ప్రదర్శన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మణిపూర్ మారణకాండను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి భద్రతలను నెలకొల్పడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున, బుగ్గవంక వంతెనలు సాధన సమితి నాయకుడు హమీద్, మన్సూర్ అలీ, చేతివృత్తిదారుల సంఘం జిల్లా నాయకురాలు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా

కడప ఎడ్యుకేషన్ : కడపలోని ఎస్వీ డిగ్రీ కళాశాల సర్కిల్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ రామక్రిష్ణ, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గనిరాజు, రాజశేఖర్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శులు అంకన్న, కిరణ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోత్ సునీల్, జునైద్‌బాష, రాష్ట్ర కోశాధికారి జాకీర్, రాష్ట్ర నాయకులు నాగరాజు, కడప జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్, మానస, సాహితీ, ఉమ, అన్నమయ్య జిల్లా నాయకులు స్వరూప్‌తేజ్, శ్రీనాథ్, గోషిణ్, అరుణోదయం, భీమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.



కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐటీయూసీ, ప్రజా సంఘాల నాయకులు

కడప జట్టు విజయభేరి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో కడప జట్టు విజయం సాధించింది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న మ్యాచ్‌లో 53 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కర్నూలు జట్టు 52.2 ఓవర్లలో 223 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని మనోజ్‌రాజు 88 పరుగులు చేశాడు. కడప బౌలర్లు ఎస్ఎండీ అస్లాం 4, సాయిఅర్థిత్‌రెడ్డి 4 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 38 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 171 పరుగులు చేసింది. జట్టులోని సుదర్శన్ 61, విజయ్ రామిరెడ్డి 55 పరుగులు చేశారు. దీంతో కడప జట్టు 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాగా కర్నూలు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 128 పరుగులు చేయగా, కడప జట్టు 183 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

డబుల్ సెంచరీ



అర్జున్ టెండూల్కర్, (205 పరుగులు)



సుదర్శన్, (61 పరుగులు)

వైఎస్‌ఆర్‌ఆర్–ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో రెండో రోజు సోమవారం 86 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు 58 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 318 పరుగులు చేసింది. జట్టులోని అర్జున్ టెండూల్కర్ 142 బంతుల్లో 18 ఫోర్లు, 14 సిక్సర్లతో 205 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ప్రశాంత్ 56 పరుగులతో క్రీజులో ఉన్నాడు. నెల్లూరు బౌలర్ సుతేజ్‌రెడ్డి 2 వికెట్లు తీశాడు. కాగా నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 278 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో అనంతపురం జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 40 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

సన్మార్గంలో నడవాలి



వేంపల్లె : శివ పురాణాన్ని పఠిస్తున్న పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి

వేంపల్లె : ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నైమిషారణ్య పీఠాధిపతి శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలోని శ్రీవృషభాచలేశ్వర దేవస్థానం అనుసంధానమైన వీరాంజనేయస్వామి ఆలయాన్ని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎస్.బట్టార్, హరిప్రవీణ్‌లు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతికి శాలువా కప్పి సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయ ఈఓ శ్రీధర్, ఆలయ చైర్మన్ కె.వెంకటేష్‌ల ఆధ్వర్యంలో శివ పురాణం, ప్రవచనాలు పఠించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీగాయత్రి, ఆర్.శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు అరవింద్, బాలాజి, శ్రీనివాసులు, హరికుమార్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

మల్లేశ్వరస్వామి సేవలో..

పెండ్లిమర్రి : మండలంలోని పాలతల మల్లేశ్వర స్వామిని నైమిశారణ్య పీఠాధిపతి శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి దర్శించుకొన్నారు. మల్లేశ్వర స్వామి అనుబంధ ఆలయాలైన అక్కదేవతలు, బండెన్న, పుట్టా అంజన్నస్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాదేవుడైన శివుడిని పూజించడం ద్వారా సమస్త బాధలు తొలగి సుఖ సంతోషాలు కలుగుతాయని ఆయన భక్తులకు ఉపదేశించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంబటి నాగమల్లారెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇన్‌స్పైర్ మనాక్‌కు నామినేషన్లు పంపాలి



ఇన్‌స్పైర్ మనాక్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో త్వరలో నిర్వహించనున్న ఇన్‌స్పైర్ మనాక్ 2023–24 కార్యక్రమానికి అన్ని యాజమాన్య పాఠశాలల నుంచి నామినేషన్లు రావాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ఇన్‌స్పైర్ మనాక్ 2023–24 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం కడప డీఈఓ కార్యాలయంలో జిల్లా సైన్సు అధికారి మహేశ్వరెడ్డితో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇన్‌స్పైర్ కార్యక్రమానికి జిల్లాలోని ప్రతి ఉన్నత పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులను నామినేట్ చేయాలన్నారు. ఈ విషయంలో సైన్సు ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. నామినేషన్ల ప్రక్రియలో మీకు ఏదైనా సమస్య ఎదురైతే పరిష్కారం చూపించడానికి జిల్లా సైన్సు అధికారి (డీఎస్ఓ) మహేశ్వరెడ్డి అందుబాటులో ఉంటారన్నారు. విద్యార్థులకు బ్యాంకు అకౌంట్లు లేవనో, గతంలో ప్రాజెక్టులు సెలెక్టు అవ్వలేదనే, ఈ సంవత్సరం మరో సైన్సు టీచర్ బాధ్యతనో చిన్న చిన్న కారణాలతో ఇన్‌స్పైర్‌కు విద్యార్థులను నామినేట్ చేసే బాధ్యత నుంచి తప్పించుకోవడం సరైంది కాదన్నారు. మీ ప్రతి సందేహానికి 9441035830 నంబర్ డీఎస్ఓ మహేశ్వరెడ్డికి ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలని తెలిపారు. ఈ నామినేషన్ ప్రక్రియకు ఆగస్టు 31వ తేదీ వరకు గడువు ఉందన్నారు. ఈ లోపు విద్యార్థుల నుంచి సమాచారాన్ని సేకరించుకుని నామినేషన్ల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా రెండేళ్ల నుంచి ప్రైవేటు పాఠశాలల నుంచి నామినేషన్లు చాలా తక్కువగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ మహేశ్వరెడ్డి తోపాటు డీఈఓ కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘గురుకులం’లో సీటు ఇప్పిస్తానంటూ మోసం

కమలాపురం : కమలాపురంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సీట్లు ఇప్పిస్తానంటూ ఓ జూనియర్ అసిస్టెంట్ మోసం చేశాడంటూ పలువురి విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం వ్యక్తం చేశారు. వారు సోమవారం పాఠశాల వద్దకు చేరుకున్నారు. పాఠశాలలో పని చేసే జూనియర్ అసిస్టెంట్ రామయ్య.. పిల్లలకు సీటు ఇప్పిస్తామని చెప్పి ఒక్కొక్కరి వద్ద నుంచి నాలుగైదు వేలు తీసుకున్నాడని గంగన్న, ఓబులమ్మ, సావిత్రి, రాజారావు తదితరులు పేర్కొన్నారు. నగదు రూపంలో కొంత మొత్తాన్ని, ఫోన్ పే ద్వారా కొంత మొత్తాన్ని ఇచ్చామని చెప్పారు. ఇపుడేమో సీట్లు ఇవ్వలేదని వాపోయారు. నెల రోజులుగా తమను ఇబ్బందులకు గురి చేశాడని ఇన్‌చార్జి ప్రిన్సిపల్, అధ్యాపకుల ఎదుట వారు పేర్కొన్నారు. దీనిపై జూనియర్ అసిస్టెంట్ రామయ్యను వివరణ కోరగా.. తనకు డబ్బులు ఇచ్చినట్లు వీరు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని అన్నారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు డబ్బులు ఇచ్చిన విషయంపై నిలదీయగా అక్కడ నుంచి వెళ్లిపోయాడు. ప్రిన్సిపల్ తులశమ్మను వివరణ కోరగా.. విద్యార్థుల తల్లిదండ్రులు ఇంత వరకూ ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకురాలేదని తెలిపారు. ఇప్పుడు తమ దృష్టికి వచ్చిందని, జూనియర్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుని, విద్యార్థుల తల్లిదండ్రులకు డబ్బులు తిరిగి ఇప్పించడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

8 మందిపై కేసు

సిద్దవటం : మండలంలోని నేకనాపురం గ్రామంలో ఆదివారం జరిగిన ఘర్షణలో 8 మందిపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. నేకనాపురం గ్రామంలో శ్రీనివాసులు, కుమార్‌రెడ్డి మధ్య మాటకుమాట పెరిగి ఘర్షణకు దారి తీసిందన్నారు.

చింతకుంట చిత్రాల రక్షణకు సర్వే



రేఖాచిత్రాలను పరిశీలిస్తున్న ఆర్కియాలజీ అధికారులు

కడప కల్చరల్ : 25 వేల ఏళ్ల నాటి ఆది మానవుని రేఖా చిత్రాలు గల చింతకుంట గుహల రక్షణ కోసం ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా సంస్థ అధికారులు స్థానిక సర్వేయర్లతో కలిసి సోమవారం సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కన్జర్వేషన్ అసిస్టెంట్ బాలకృష్ణారెడ్డి కడప నగరంలో ‘సాక్షి’తో మాట్లాడారు. ప్రధాన కార్యాలయ సర్వేయర్ ఫణీంద్రతో కలిసి ఇద్దరు స్థానిక సర్వేయర్లు ఆదిమానవుని రేఖా చిత్రాలుగల ప్రాంతంలో రక్షిత ప్రాంతాన్ని సర్వే చేసినట్లు తెలిపారు. చిత్రాలుగల 13 గుండ్లను రక్షించుకునేందుకు ఆ చుట్టుపక్కల 46 ఎకరాలు ఇవ్వాలని ఇంతకుముందు కోరామని, వాటి సంపూర్ణ రక్షణ కోసం ప్రస్తుతం 259 ఎకరాలు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఈ చిత్రాలు గల గుండ్లు సర్వే నంబరు 425లో ఉన్నాయని, 426 నుంచి మైనింగ్‌కు అనుమతి ఉందని, రక్షిత ప్రాంతం ఆక్రమణకు గురైందేమోనన్న అనుమానంతో సర్వే నిర్వహించామన్నారు. మైనింగ్‌కు కూడా ఈ నెల 26వ తేదీ వరకు స్టే ఉందని, ఈలోపు పక్కా సర్వే నిర్వహించేందుకు తమ సంస్థ సర్వేయర్లతోపాటు స్థానిక సర్వేయర్లతో గుండ్లు గల ప్రాంతాన్ని కొలతలు తీసుకున్నామని తెలిపారు. ఒకవేళ రక్షిత ప్రాంతాన్ని కూడా మైనింగ్‌కు ఇచ్చి ఉంటే దాన్ని తమ శాఖకు బదలాయించాలని కోరుతున్నామన్నారు. ప్రైవేటు వారికి ఇచ్చి ఉంటే దాన్ని ల్యాండ్ అక్విజేషన్ ద్వారా తీసుకుని రక్షిత ప్రాంతంగా ప్రకటిస్తామన్నారు. ఈ ప్రాంతంలో మొత్తం 14 గుండ్లపై ఆదిమానవుని అరుదైన రేఖా చిత్రాలు ఉన్నాయని, అందులోని మల్లెంగుండు ఇప్పటికే మైనింగ్ కోసం ధ్వంసం చేశారని, మిగతా వాటినైనా రక్షించుకోవాలన్న ప్రయత్నంలో భాగంగా ఈ సర్వే నిర్వహిస్తున్నామన్నారు. తమ శాఖ సర్వేయర్లతో పాటు ముద్దనూరు మండల సర్వేయర్లు ఉమ్మడిగా నిర్వహించిన ఈ సర్వే రిపోర్టు త్వరలో వస్తుందని, తాము కోరిన 259 ఎకరాలను తమకు బదలాయిస్తే వెంటనే రక్షణ చర్యలు చేపడతామని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి తీవ్ర గాయాలు

ఓబులవారిపల్లె : మండల పరిధి చిన్నఓరంపాడులో విద్యుత్ ఘాతంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన తమ్మిరెడ్డి శ్రీనివాసులురెడ్డి బోరు మరమ్మతు పనులు చేస్తుంటాడు. సోమవారం చిన్నఓరంపాడు చేకూరి రమణ అనే రైతు వ్యవసాయం పొలం వద్ద బోరు మరమ్మతుకు శ్రీనివాసులురెడ్డి తన ఇద్దరు కుమారులు విష్ణురెడ్డి(20), చైతన్యరెడ్డిలను సాయం కోసం తీసుకెళ్లాడు. మరమ్మతులు చేస్తుండగా బోరు మరమ్మతులు చేసే ట్రాక్టర్ పైభాగం 11 కేవీ లైన్‌కు తగలడంతో కరెంటు సోకి మంటలు చెలరేగాయి. దీంతో ట్రాక్టర్ పట్టుకొని ఉన్న విష్ణురెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. చుట్టు పక్కల వారు గమనించి వైర్లు పక్కకు తీసి విష్ణురెడ్డిని చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వేలూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో చైతన్యరెడ్డికి కూడా స్వల్ప గాయాలయ్యాయి.